క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



పలమనేరు/బైరెడ్డిపల్లె: కుప్పం పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలు పలమనేరు, బైరెడ్డిపల్లెలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పవిత్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, మండీ సుధా, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, బైరెడ్డిపల్లె ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కార్తిక్, సర్పంచ్ వెంకటేష్, నేతలు మహబూబ్‌ఖాన్, తబ్రాజ్, బాలాజి, శ్రీనివాసులు, శైలేష్ చక్రవర్తి, రెడ్డివీనస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

పుంగనూరు: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా వైద్యసేవలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మున్సిపల్ చైర్మన్ అలీం బాషా అన్నారు. బుధవారం కొత్తపేట వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్లు జయేష్, మాధవరెడ్డి, హిమబిందు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మమత, జయభారతి, నాయకులు జావిద్ పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

రొంపిచెర్ల: ఎస్టీయూ శాఖ నూతన సంవత్సరం డైరీలు, క్యాలెండర్లను రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీనివాసులు బుధవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు లోకనాథ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తమ అసోసియేషన్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమణా రెడ్డి, నరసింహారెడ్డి, షానవాజ్, యల్లప్ప, రవిశేఖర్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి, రమేష్, ఇర్ఫాన్, సదాశివ రెడ్డి, అక్బర్‌బాషా, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్ టాప్‌ను అందజేస్తున్న ఎన్ఆర్ఐ వెంకటరమణా రెడ్డి

రొంపిచెర్ల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రోసా సంస్థ సభ్యులు, ప్రవాసాంధ్రుడు దేవులపల్లె వెంకటరమణారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన కేజీబీవీ పాఠశాలకు ఒక ల్యాప్ టాప్‌ను వితరణ చేసి మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచిపదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రోసా కార్యదర్శి కె.వెంకటరమణా రెడ్డి, బర్డ్ సంస్థ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతి, మునిలక్ష్మి, దీపిక తదితరులు పాల్గొన్నారు.


జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక



మొహసీన్

సదుం: జాతీయ ఉపకార వేతనానికి తమ స్కూలు విద్యార్థిని ఎంపికైందని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని మొహసీన్ ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి దీనికి అర్హత సాధించిందని, ఆ విద్యార్థినికి ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందనున్నట్టు చెప్పారు. విద్యార్థినిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రిపబ్లిక్ డే వేడుకలకు కరిష్మా



పుంగనూరు: పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్‌లో గత ఏడాది పదవ తరగతిలో 584 మార్కులు సాధించిన కరిష్మాకు విజయవాడలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు హెచ్ఎం రుద్రాణి తెలిపారు. రాజ్ భవన్ జాయింట్ కార్యదర్శి ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

'మట్టిలో మాణిక్యాల'కు భవిత



కబడ్డీ పోటీలతో తలపడిన పురుషుల జట్టు,



మహిళల జట్లు

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'
- నియోజకవర్గ స్థాయి పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ
- కబడ్డీ విజేతలుగా పలమనేరు, పెద్దపంజాణి



నియోజకవర్గ కబడ్డీ విజేతగా నిలిచిన పలమనేరు జట్టుతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాల్లా ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తెచ్చి, వారికి ప్రోత్సహించి మంచి భవిష్యత్తు కల్పించాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కబడ్డీ పోటీలను లాంఛనంగా ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికితీసి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులు తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఇక్కడ వాలీబాల్, 27న బ్యాడ్మింటన్, 29న క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్టు ఆర్డీఓ, కార్యక్రమ నోడల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విన్నర్స్‌కు రూ.35వేలు, రన్నర్స్‌కు రూ.15వేలు, మూడో స్థానం నిలిచిన జట్టుకు రూ.5వేలతోపాటు షీల్డ్, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. అలాగే ఇక్కడ గెలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

కబడ్డీ విజేతలు పలమనేరు, పెద్దపంజాణి

కబడ్డీ పోటీల పురుషుల విభాగంలో ఐదు జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో పలమనేరు జట్టు విజేతగా నిలిచింది. అలాగే మహిళల విభాగంలో పెద్దపంజాణి విన్నర్స్‌గా నిలిచింది. కార్యక్రమంలో పట్టణానికి చెందిన రాష్ట్రస్థాయి క్రీడాకారులు మోక్షిత్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైస్ చైర్మన్ రవి, జెడ్పీటీసీ మల్లిక, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, కన్వీనర్ బాలాజినాయుడు, మాజీ కన్వీనర్ మండీ సుధా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, స్పెషలాఫీసర్ గోవర్ధన్‌రెడ్డి, స్పెషలాఫీసర్లు నాయక్, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ విద్యాసాగర్ నియోజకవర్గంలోని ఎంఈఓలు, పీడీలు, పీఈటీలు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కల్యాణం.. కమనీయం





కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్) కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

గంగవరం: పలమనేరు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం భక్తజన సందడి నడుమ పలమనేరులో కనుల పండువగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని లయన్స్‌క్లబ్ ఎదురుగా ఉన్న మైదానంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. ప్రత్యేకంగా అలంకరించి, వేద పండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజలు చేశారు . మంగళవాయిద్యాల నడుమ కంకణధారణ, భక్తి సంకల్పం లాంటి క్రతువులను నిర్వహించి కల్యాణోత్సవం నిర్వహించారు. పలమనేరు నియోజకవర్గం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరానికి స్పందన



పాడి రైతులకు దాణా పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీధర్

రొంపిచెర్ల: మూగ జీవాలకు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు విధిగా వేయించుకోవాలని మండల పశు వైద్యులు డాక్టర్ శ్రీధర్ కోరారు. బుధవారం బండకిందపల్లె వాటర్‌షెడ్ పరిధిలోని మటోళ్లపల్లెలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆవులకు, దూడలకు పిడుదల నివారణకు మందును పిచికారీ చేశారు. గొర్రెలకు నట్టల నివారణకుగాను చికిత్స చేశారు. పాడి రైతులకు ఉచితంగా దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్సర్‌బాషా, ఎంపీటీసీ లక్ష్మి, వాటర్‌షెడ్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, పీఓ తేజస్విని, టెక్నికల్ అసిస్టెంట్ అన్సర్‌బాషా, పశు వైద్య సిబ్బంది పునీత్‌కుమార్, ఎస్ఆర్. సంపత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లా చూపిన మార్గంలోనే జీవించాలి



పుంగనూరులో ఇస్తిమాకు హాజరైన ముస్లింలు

- మత పెద్దల పిలుపు
- ఇస్తిమాకు భారీగా తరలి వచ్చిన ముస్లింలు

పుంగనూరు: ముస్లింలు ప్రతి ఒక్కరూ అల్లా ప్రబోధించిన మార్గంలోనే జీవించాలని, ఖురాన్‌ను పఠించి నిత్య నమాజ్ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ముస్లిం మత గురువులు పిలుపునిచ్చారు. బుధవారం భీమగానిపల్లె క్రాస్ వద్ద ఇస్తిమా కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన మతగురువులు మౌలానా ఫరూక్ సాహెబ్, అక్బర్ సాహెబ్, ముఫ్తి అస్లాంసాహెబ్, ఎంఎస్ సర్దార్ సాహెబ్ ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ సూక్తులను ముస్లింలకు వివరించారు. ముస్లింలు నిత్యం నమాజ్ చేస్తే ఎంతో ఆరోగ్యవంతులుగా, ఐశ్వర్య వంతులుగా ఉంటారని పేర్కొన్నారు. పేదలను ఆదరించడం, దానధర్మాలతో పలువురికీ ఆదర్శంగా ఉండాలన్నారు. ఇస్తిమా కమిటీ ఆధ్వర్యంలో భోజన, వసతిని కల్పించారు. తొలిరోజు సుమారుగా 20 వేల మంది ముస్లింలు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమజిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము పాల్గొన్నారు.

ఇంటింటా కులగణన సర్వే

చౌడేపల్లె: ఇంటింటా కుల గణన సర్వే బుధవారం నిర్వహించారు. కొండామర్రి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వేకువజామునే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను లాగిన్‌లో అప్‌డేట్ చేస్తున్నట్లు వీఆర్వో అశోక్ రెడ్డి తెలిపారు. ఇంటి యజమానితో పాటు వలంటీర్, కేటాయించిన క్లస్టర్ సచివాలయ అధికారి బయోమెట్రిక్ వేయాలని సూచించారు. ఈనెల 28వ తేదీ లోపు ఈ సర్వే పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ శారద, వలంటీర్లు ఉపేంద్ర, శివారెడ్డి, తస్లీమా, బాజీద్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న వీఆర్వో అశోక్‌రెడ్డి, సిబ్బంది

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



కృష్ణకుమార్

శాంతిపురం: తహసీల్దారుగా కృష్ణకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన డెప్యుటేషన్‌పై ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నరసింహులు బదిలీ కావడంతో డెప్యూటీ తహసీల్దార్ కొలేష్ ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

అన్నదానానికి విరాళం



విరాళం స్వీకరిస్తున్న ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద ఉచిత అన్న ప్రసాద కేంద్రానికి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఏ.నారాయణ, కళావతి దంపతులు రూ.50 వేల విరాళమిచ్చారని ఆలయ ఈఓ చంద్రమౌళి బుధవారం తెలిపారు. కోరిన కోర్కెలు ఫలించడంతో వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. ఆలయ అధికారులు వారిని సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

మోడల్‌స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎన్ఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న గౌరి శశిధర్ రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో గెలుపొంది పరీక్షల్లో మొదటి గ్రేడు సాధించాడు. అలాగే జి.సాగసాయిరెడ్డి, ఎస్.మదీన్‌తాజ్, జి.వైష్ణవి, ఎన్.దీపిక స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ తెలిపారు. వారిని ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కాపు భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

కుప్పం: నియోజకవర్గంలోని కాపు (వక్కలింగ) కులస్తులకు కమ్యూనిటీ భవన నిర్మాణం నిమిత్తం గుడుపల్లె మండలం గుత్తార్లపల్లెలోని 40 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించారు. బుధవారం ఈ స్థలాన్ని ఆర్డీఓ శ్రీనివాసులుతోపాటు కాపు కుల సంఘ నాయకులు పరిశీలించారు. ఇప్పటికే కేటాయించిన ఈ స్థలాన్ని త్వరలో కాపు నాయకులు అందజేస్తామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో గుడుపల్లె జెడ్పీటీసీ కృష్ణమూర్తి, శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు, కాపు సంఘ నేతలు పాల్గొన్నారు.

అక్రమంగా చెరువులో మట్టి తవ్వకాలు



జేసీబీతో చేస్తున్న మట్టి తవ్వకం పనులు

కుప్పం: పట్టణంలోని కుప్పం చెరువుల్లో అక్రమంగా బంకమట్టిని తవ్వి తరలిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి రెండు జేసీబీలు, 10 ట్రాక్టర్లను ఈ పనులకు వినియోగించారు. కృత్రిమ ఇసుక తయారీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అడ్డుఅదుపూ లేకుండా చెరువు మట్టిని తవ్వేస్తున్నారు. పట్టణంలోని చెరువు కావడంతో చుట్టు పక్కల ప్రజలు మట్టి తవ్వకాలకు అభ్యంతరాలు చెబుతున్నా పట్టించుకునే నాథుడు లేదు. అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యతో నారీశక్తులుకండి



బైరెడ్డిపల్లె: కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ సాయిలీల

బైరెడ్డిపల్లె: పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎంఈఓ సాయిలీల అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, విద్య ఒక్కటే మహిళలను శక్తిగా మారుస్తుందన్నారు. బాగా చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శోభ, స్వరూప, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, పౌష్టికాహార లోపంతో కలిగే ఆరోగ్య సమస్యలను తెలియజేశారు. ఎవరైనా ఆకతాయిలు, అపరితులు అసభ్యంగా ప్రవర్తిస్తే విద్యార్థినులు భయపడకుండా తల్లిదండ్రులు, పోలీసులకు తెలియజేయాలన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో లినార్డ్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, బాలికలు ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు వహించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనుకోని ఆపద సమయంలో బైటపడేందుకు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. అలాగే ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే తల్లిదండ్రులకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

విద్యతోనే పరిపూర్ణ వికాసం

పలమనేరు: విద్యతోనే పరిపూర్ణ వికాసం సాధ్యమవుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇప్పటికీ బాలికలపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బాలికలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో దూసుకెళ్లి తమ సత్తా ఏమిటో చాటాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వివిధ రకాల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మీనాక్షి, సమితి కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో..

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. మదర్ థెరీసా కళాశాల ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ కిశోర్, గంగవరం పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య మాట్లాడారు. విద్యతోనే మహిళా వికాసం సాధ్యమని విద్యార్థులు గ్రహించి ముందుకు పోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



చౌడేపల్లె: మాట్లాడుతున్న సూపర్ వైజర్ రమాదేవి



పలమనేరు: పుస్తకాలు అందుకున్న హాస్టల్ విద్యార్థులతో సమితి నిర్వాహకులు



పలమనేరు: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య